INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN: 2277-7881; IMPACT FACTOR – 6.014; IC VALUE:5.16; ISI VALUE:2.286
VOLUME 8, ISSUE 8(7), AUGUST 2019

# 'గోపాత్రుడు' నవల- శిల్ప వైవిధ్యం

డా.జె.నీరజ
అసిస్టెంట్ ప్రొఫెసర్ (అకడమిక్ ఆఫీసర్)
అకడమిక్ సెల్
కళాశాల విద్యాశాఖ, తెలంగాణ

**వ్యాస సంగ్రహణం:**

తెలుగు సాహిత్యంలో విలక్షణ రచయితగా ముద్ర వేసిన కె.ఎన్.వై. పతంజలి నవలా ఇతివృత్తాల్లో సరికొత్త ప్రయోగాలు చేశారు. ఆయన రచనలు కేవలం కథలు కావు, సమాజంలోని రాజకీయ అవినీతిని, వ్యవస్థలోని లొసుగులను కడిగిపారేసే శస్త్రచికిత్సలు. పతంజలి తన అంతరంగంలోని ఆక్రోశాన్ని, సామాజిక అన్యాయాలను ఎత్తిచూపడానికి 'బ్లాక్ హ్యూమర్' (విషాద హాస్యం)ను ప్రధాన ఆయుధంగా మలచుకున్నారు. సాంప్రదాయ రచనా పరిధులను ధిక్కరిస్తూ వ్యంగ్యం అనే అస్త్రంతో, ప్రాంతీయ మాండలికాల సొబగులతో పాఠకుడిని ఆలోచింపజేశారు. 'గోపాత్రుడు' నవలలో 'భూమి గుండ్రంగా ఉందా, బల్లపరుపుగా ఉందా?' అనే సామాన్యమైన ప్రశ్న ఆధారంగా అలమండ గ్రామంలోని ప్రజలు రెండు పక్షాలుగా చీలిపోవడాన్ని చూపిస్తూ... మానవ మనస్తత్వం, అవకాశవాదం, కులప్రీతి, అధికార దాహాన్ని రచయిత ఇందులో అద్భుతంగా పరిహసించారు. ఆధునిక విమర్శా దృక్పథంతో చూస్తే, పతంజలి 'గోపాత్రుడు' నవలలో మూడు ప్రధాన శిల్ప రీతులను (మెటాఫిక్షన్, అద్భుత వాస్తవికత, సమాంతర వాస్తవికత) ప్రయోగించి వాస్తవికతను విస్తరింపజేశారు. కథనమే విమర్శగా మారే 'మెటాఫిక్షన్' (అధికల్పన) ద్వారా కల్పనకు, సామాజిక విమర్శకు మధ్య సమతుల్యతను సాధించారు. పంచతంత్ర, భగవద్గీత వంటి పురాణ, జానపద పోకడలను మేళవించి, కుక్క అయిన 'వీరబొబ్బిలి' స్వగతం ద్వారాను, రొంగలి అమ్మన్నకు బుజ్జి చేసే యుద్ధ బోధ ద్వారాను సమాజంలోని అసంబద్ధతను 'అద్భుత వాస్తవికత' (మేజిక్ రియలిజం) రూపంలో ఆవిష్కరించారు. చివరగా, గోపాత్రుడి భార్య-కుక్క తగువు వంటి ఉప-సన్నివేశాల ద్వారా సమాజంలో బలం ఉన్నవాడిదే పైచేయి అనే 'సమాంతర వాస్తవికతను' (ప్యారలల్ రియలిజం) సృష్టించారు. ఈ విధంగా 'గోపాత్రుడు' కేవలం ఒక సామాజిక వ్యంగ్య రచన మాత్రమే కాకుండా... వాస్తవం, కల్పన, విమర్శల మేళవింపుగా రూపుదిద్దుకున్న ఒక అద్భుత శిల్ప ప్రయోగాత్మక రచనగా నిలిచింది.

**కీలక పదాలు:** కె.ఎన్.వై. పతంజలి, గోపాత్రుడు, నవల శిల్పం, మెటాఫిక్షన్, అద్భుత వాస్తవికత, సమాంతర వాస్తవికత

తెలుగు సాహిత్యంలో విలక్షణమైన ముద్ర వేసిన రచయిత పతంజలి నవలా ఇతివృత్తాల్లో సరికొత్త ప్రయోగాలు చేశారు. ఆధునిక విమర్శా రీతుల నేపథ్యంలో పతంజలి రచనల శైలిని క్లుప్తంగా ఇక్కడ చూడవచ్చు. పతంజలి నవలలు కేవలం కథలు మాత్రమే కాదు, అవి సమాజంలోని కుళ్లును కడిగిపారేసే శస్త్రచికిత్సలు. ఆయన

ఇతివృత్తాలు ప్రధానంగా మధ్యతరగతి జీవితాల చుట్టూ, రాజకీయ అవినీతి, మరియు వ్యవస్థలోని లొసుగుల చుట్టూ తిరుగుతాయి. పతంజలి బ్లాక్ హ్యూమర్ (విషాద హాస్యం) వాడటంలో దిట్ట. చదువరిని నవ్విస్తూనే, ఆ నవ్వు వెనుక ఉన్న చేదు నిజాలను, సామాజిక అన్యాయాలను ఎత్తిచూపడం ఆయన తాత్వికతలోని ప్రత్యేకత. "నవ్వు నాలుగు విధాలా చేటు" అన్న సామెతను తిరగరాసి, వ్యవస్థలోని అరాచకాలను నవ్వుతూనే నిలదీయడం పతంజలి మార్కు విషాద హాస్యం.

పతంజలి రచనల్లో శిల్పం చాలా పదునుగా, సూటిగా ఉంటుంది. ఆయన సంభాషణలు తూటాల్లా పేలుతూ, అనవసరమైన వర్ణనలకు తావు లేకుండా సాగుతాయి. ఆధునిక విమర్శా దృక్పథంతో చూస్తే, ఆయన శిల్పంలో వ్యంగ్యం ఒక ప్రధాన అస్త్రం. పాత్రల చిత్రణలో సహజత్వం, ప్రాంతీయ మాండలికాల సొబగులు కనిపిస్తాయి. సమాజం పట్ల ఉన్న ఆగ్రహాన్ని హాస్యం అనే ముసుగులో అందిస్తూ, పాఠకుడిని ఆలోచింపజేసే విభిన్న శిల్ప రీతులను ఆయన తన నవలల్లో అద్భుతంగా ప్రయోగించారు.

**గోపాత్రుడు -బ్లాక్ హ్యూమర్ తాత్వికత**

పతంజలి రచనల్లో కనిపించే ప్రత్యేకమైన శక్తి బ్లాక్ హ్యూమర్ (విషాద హాస్యం). ఈ శక్తితోనే పతంజలి మనిషిలోని జీవన విషాదాన్ని తన రచనల్లోకి ఒంపుకున్నాడు. వ్యవస్థల్లోని బీభత్సాన్ని రచనలకు నేపథ్యంగా స్వీకరించాడు. సమాజంలోని అమానవీయతను అక్షరాల్లో ప్రతిబింబించాడు. దీనికి కారణమైన వ్యవస్థల వికృత స్వభావాన్ని వెల్లడించడానికి బ్లాక్ హ్యూమర్ ను ప్రధాన ఆయుధంగా ప్రయోగించాడు. పతంజలి ఈ విషాదహాస్య ధోరణిని బలమైన వాహికగా మార్చుకుని తన అంతరాంతరాల్లో గూడుకట్టుకున్న బాధ, వేదన, ఆగ్రహం, ఆక్రోశాలను తన రచనలు సాకుగా వ్యక్తీకరించాడు. ఈ సందర్భంలోనే సంప్రదాయ రచనా పద్ధతుల్ని, పరిధుల్ని ధిక్కరిస్తూ, అంతరాయ పరుస్తూ తనదైన ప్రత్యేక స్థానాన్ని సాహిత్యంలో నిలబెట్టుకున్నాడు.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికా కాల్పనిక సాహిత్యంలో అప్పటి వరకు వున్న ఆలోచనలు, ఆచారాల పట్ల నిరసన మొదలైంది. కొత్త ప్రశ్నలు, పాత సమాధానాలపై అనుమానాలు మొలకెత్తిన నేపథ్యంలో ఒక భీతావహమైన పరిస్థితిని చిత్రిస్తూ వెలువడిన హాస్యరచనల ధోరణులను వర్ణించడానికి అమెరికన్ సాహిత్యకారుడు Konrad Knicker Bocker బ్లాక్ హ్యూమర్ అనే పదాన్ని మొదటిసారిగా ఉపయోగించాడు. సర్రియలిస్టు ఉద్యమ పితామహుడు, ప్రపంచ ప్రసిద్ధ కవి ఆండ్రే బ్రెతా 45 మంది 'Anthologie de L'humour noir' వెలువరించాడు. Humour noir అనే ఫ్రెంచ్ పదానికి సమానార్థకంగా ఆంగ్లంలో 'బ్లాక్ హ్యూమర్' అనే మాట వాడుకలోకి వచ్చింది. 1960లలో సాహిత్య విశ్లేషణలో బ్లాక్ హ్యూమర్ అనే మాట ఒక భాగమై పోయింది. కాల్పనిక సాహిత్యానికి ఆదరణ తగ్గిన రోజుల్లో 1965లో టైమ్ (TIME) పత్రిక కొద్దిమంది నవలాకారుల గురించి ఒక ప్రత్యేక వ్యాసాన్ని ప్రచురించింది. ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో, వ్యంగ్య స్వభావంతో, తీవ్రమైన ప్రయోగాత్మకత, శక్తివంతమైన శైలీగత ధోరణులతో కూడిన ఆయా నవలా రచయితలను The Black Humorists అని పేర్కొంది. అలా పేర్కొన్న వారిలో బ్రూస్.కె.ఫ్రెడ్మాన్, జోసెఫ్ హెల్లర్, జాన్ బర్త్, వార్న్ మిల్లర్ మొదలైనవారు ముఖ్యులు. సాహిత్య విమర్శలో

బ్లాక్ హ్యూమరిస్ట్ అన్న పదం వాడిన ప్రతిసందర్భంలోనూ కొంత వివాదం చెలరేగింది. బ్లాక్ హ్యూమర్ నవలలుగా చెప్పబడుతున్న వాటిలో ఏముంటుంది? బ్లాక్ హ్యూమరిస్ట్ రచనా విధానం ఎట్లా ఉంటుందనే అంశమే వివాదాలకు కేంద్ర బిందువు. బ్లాక్ హ్యూమర్ రచయిత క్షీణించిన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ సిద్ధాంతాలు, విశ్వాసాల పట్ల పెను ఆగ్రహం కలిగిన రచయితగా పేర్కొంటారు.

బ్లాక్ హ్యూమర్ అనే మాటకు తెలుగు సమానార్థక పదాన్ని పరిశీలిద్దాం. ఇందులో Black అనే తొలిమాట జీవితంలోని 'విషాదాన్ని' సూచిస్తుంది. అంతేగాక ఒక నిరసన, వేదన, నిరాశ, కల్లోలం, నివాళి, ప్రమాదం తాంటి ప్రతికూల భావాలకు ప్రతీకగా వాడుకుంటాం. ఇంకా విస్తృతపరుచుకుంటే అనారోగ్యం, భౌతిక విరూపం, పిచ్చితనం, క్రమరాహిత్యం, అమానవీకరణ, శకలీకరణ, సామాజిక రాజకీయ సిద్ధాంతాల నైతిక విలువల క్షయం, జీవన నియమ సూత్రాలు, సంప్రదాయాలు మొదలైన వాటిపట్ల పట్టింపు లేని తనంగా అర్థం చేసుకోవచ్చు. ఇక రెండవ పదం Humour= to mock at, ridicule or to laugh at అంటే వెక్కిరించడం, హేళన చేయడం, నవ్వడం అని పేర్కొనవచ్చు. జీవితంలోని అసంబద్ధతను చూసి రచయిత పరిహసిస్తాడు. అంతిమంగా నవ్వేస్తాడు. స్వీయాత్మ విధ్వంసక్రమాన్ని, అమానవీకరణను చూసిన రచయిత వాటిని పరిహసిస్తాడు. బ్లాక్ హ్యూమర్ కు సంభాషణా శక్తి ప్రాణం.

సాహిత్య విమర్శలో పతంజలి ప్రస్తావన వచ్చినప్పుడు వారిని శక్తివంతమైన వ్యంగ్య రచయితగానే ఎక్కువగా గుర్తించారు. 'రావిశాస్త్రి తరువాత అంతే శక్తివంతంగా సెటైర్ రాయగల రచయిత కె.ఎన్.వై.పతంజలి' అని ప్రముఖ విమర్శకులు బి. తిరుపతిరావు పరిగణించినా, 'వ్యంగ్యాన్ని ప్రధానం చేసి ప్రక్రియను అప్రధానం చేయడం కె.ఎన్.వై. పతంజలి వంటి వారికే సాధ్యం. ఇదే పూర్తి స్థాయి వ్యంగ్యం' అని విమర్శకులు సతీష్ చందర్ పేర్కొన్నా, 'చెడ్డను వెక్కిరిస్తే, ప్రశ్నిస్తే నాకు సంతోషం కలుగుతుంది. అన్యాయాన్ని రచ్చకీడిస్తే నాకు ఆనందం కలుగుతుందని, అందుకనే నేను వ్యంగ్య రచనలు చేశాను' అని పతంజలి చెప్పుకున్నా రచయితగా అతడి నిబద్ధత, తీవ్రతలే ఆయన రచనలలో బ్లాక్ హ్యూమర్ గా పరిణామం చెందింది.

గోపాత్రుడు నవలలో 'భూమి గుండ్రంగా ఉందా, బల్లపరుపుగా ఉందా?' అన్న వాదన కేంద్రంగా అలమండ గ్రామంలోని ప్రజలు రెండు పక్షాలుగా చీలిపోతారు. ఈ రెండు పక్షాలలోని మనుష్యులను ప్రాతిపదికగా తీసుకుని గ్రామ రాజకీయ వ్యవస్థ తీరు తెన్నులు, మానవ మనస్తత్వం, అవకాశవాదం, కుల ప్రీతి, ధనకాంక్ష, అధికార దాహం మొదలైన సమస్త అవలక్షణాలకు ప్రతీకలుగా పాత్రలు ప్రవర్తనను రచయిత వ్యాఖ్యానిస్తాడు. గోపాత్రుడు పాత్ర వ్యక్తి భావప్రకటనా స్వేచ్ఛకు ప్రతీక, బ్లాక్ హ్యూమర్, ప్రజాస్వామ్యంలో ముఖ్యమైన వ్యక్తి స్వేచ్ఛకు చాలా ప్రాధాన్యత ఇస్తుంది. గోపాత్రుడులో భూమి ఆకారం పై జరిగిన చర్చ వల్ల ప్రధానంగా దెబ్బతిన్నది వ్యక్తి స్వేచ్ఛ. దీనివల్ల ప్రజాస్వామ్యబద్ధ జీవన విధానానికి విఘాతం కలుగుతుంది. వ్యక్తులకు, వర్గాలకు, సిద్ధాంతాలకు ఉండే విశ్వాసాల వల్ల అంతిమంగా మానవ పరిణత ప్రజాస్వామిక సంస్కృతి కూడా దెబ్బతినగల ప్రమాదం ఉందని రచయిత

సూచిస్తున్నట్లు చెప్పవచ్చు. గోపాత్రుడు తనకున్న స్వేచ్ఛను తాను ఉపయోగించుకున్నాడు. ఇతరులు తనని బలవంతం చేసినప్పుడు దానిని తిరస్కరించడం ద్వారా తన స్వేచ్ఛను తాను నిలుపుకున్నాడు.

**గోపాత్రుడు- శిల్ప ధోరణులు**

తెలుగు సాహిత్యంలో పతంజలిది భిన్నమైన స్వరం. అతని రచన వస్తువు, రచన పద్ధతి వేరుగా ఉంటాయి. అదేవిధంగా నిర్వచనాల పరిధికి, లక్షణం చెప్పడానికి అందని విశిష్టతను ఆయా రచనలు ప్రదర్శిస్తాయి. ఇట్లా ఉండడానికి గల కారణాలను వెతికినప్పుడు కొన్ని అంశాలు పతంజలిని తన పూర్వ రచయితలకంటే వేరుపరిచి చూపుతున్నట్లు అర్థమవుతుంది. ఈ అంశాలనే పతంజలి రచనల్లోని శిల్ప ధోరణులుగా పేర్కొనవచ్చు. పతంజలి విస్తృత సాహిత్య అధ్యయన ప్రభావం వారి శిల్ప ధోరణిలో కనిపిస్తుంది. అందుకే పతంజలి రచనలు వినూత్న శిల్ప వైవిధ్యాల కూడలి. ఇతివృత్త నిర్వహణలో శిల్పం శక్తివంతంగా తనదైన పాత్రను నిర్వహిస్తుంది. ఈ వరుసలో మొట్టమొదట చెప్పుకోవల్సింది మెటా ఫిక్షన్. రెండవది అద్భుత వాస్తవికత (Magic Realism). పతంజలి రచనలు సందర్భానుసారంగా అద్భుత వాస్తవికతను ప్రదర్శిస్తాయి. చివరిది సమాంతర వాస్తవికత (Parallel Realism). పైకి కనిపించే వాస్తవికతను అనుసరిస్తూ సమాంతరంగా మరో వాస్తవికత నిరంతరం ప్రయాణిస్తూ ఉండడమే సమాంతర వాస్తవికత. పైన పేర్కొన్న మూడు శిల్ప ధోరణులు వేటికవి విడివిడిగా అనిపించినా మూడూ ఒకదానిలో ఒకటి సంవదించి ఉంటాయి. వీటన్నింటిలో వాస్తవికత ప్రధానం. అది వస్తువులోనూ, దృక్పథంలోనూ ప్రతిఫలిస్తుంటుంది. పతంజలి రచనా క్రమం వస్తువును విస్తరింపజేస్తుంటుంది. వస్తువిస్తరణ అంటే వేరేమీ కాదు. వాస్తవికతను విస్తరింప చేయడమే. ఈ విస్తరణలో శిల్ప ధోరణులు రచయిత రచనా సంవిధానంతో ముడిపడి ఉంటాయి. ఇవి పాత్రలతో, సంభాషణలతో, సంఘటనలతో, సన్నివేశ కల్పనతో విడదీయలేని సంబంధాన్ని కలిగి ఉంటాయి.

పతంజలి కథలకు భాష్యం చెప్పడం కష్టం. తెలుగు కాల్పనిక సాహిత్యం ఏర్పరచుకునే ఇతివృత్త నిర్మాణ చట్టాలను బద్దలు కొడుతూ పతంజలి చేసిన ప్రయోగాల్ని, చూపించిన కొత్త పాత జీవన మూల్యాలని శోధించటానికి అవసరమైన విమర్శ సాధనాలు లేవు అని విమర్శకులు పతంజలి రచనల గురించి విశ్లేషణ చేశారు. వీరబొబ్బిలి, గోపాత్రుడు, పిలకతిరుగుడు పువ్వు సామాజిక ప్రవర్తన మీద పతంజలి చేసిన పదునైన విమర్శ అని కూడా విమర్శకులు పేర్కొనడం గమనార్హం. పతంజలి రచనలలో ప్రక్రియ ఏదైనా కావచ్చు కానీ అసలు ప్రక్రియ మాత్రం వ్యంగ్యం. వ్యంగ్యం అలంకారంగా వాడుకోవడం ఒక పద్ధతి అయితే వ్యంగ్యాన్నే ప్రధానం చేసి ప్రక్రియను అప్రధానం చేయటం మరొక పద్ధతి. అది పతంజలి రచనల్లో ఉన్న ప్రత్యేకత అంటారు విమర్శకులు.

**అధి కల్పన (మెటాఫిక్షన్)**

మెటా ఫిక్షన్ అన్న పదాన్ని అధికల్పన, అధికాల్పనికత, మహాకాల్పనికతగా పిలవచ్చు. వాస్తవానికి ఫిక్షన్ అంటే కల్పనా సాహిత్యం. నవలను, కల్పనా సాహిత్యాన్ని సమానార్థకంగా స్వీకరిస్తే మెటా ఫిక్షన్ అనే పదానికి అధినవల, అధివాస్తవికతగా పేర్కొనవచ్చు. పోస్ట్ మోడర్నిజమ్ లోని భాగమే అధికల్పన (మెటాఫిక్షన్) పద్ధతి.

అధికల్పన కల్పనకు, వాస్తవికతకు సమప్రాధాన్యత ఉంటుంది. వాటి మధ్య ఉండే సంబంధాన్ని గురించి ప్రశ్నించడానికి ఉద్దేశించిందని విమర్శకుల అభిప్రాయం. తొలిదశలో మెటాఫిక్షన్ అన్నమాటకు ఈ విధమైన నిర్వచనం ఉంది 'మెటాఫిక్షన్ అనేది స్వీయ చైతన్యాత్మకం, ఆత్మజ్ఞానం, వ్యంగ్యపూరితమైన ఆత్మాశ్రయ దూరాన్ని కలిగి ఉండే ఒక కల్పిత సాహిత్య ప్రక్రియ'. రచయిత స్వీయ చైతన్యాత్మకంగా ఉంటాడు.

రచయితగా పతంజలి సాధించిన పని రచనను మెటా ఫిక్షన్ గా మార్చడం. పూర్వ రచన పద్ధతుల నుంచి వైదొలగడం. వైదొలగుతున్నాడని చైతన్యం రచయితకు ఉంది కాబట్టి నాది సాహిత్యం కాదు అని అనగలిగాడు. పతంజలి కథనం ఒక చరిత్ర. కథనం లేకపోతే చరిత్ర లేదు. పతంజలి రచనలలో కథనం ఒక సాకు. ఆయన కథనం చరిత్రను మాట్లాడుతుంది. అది వర్తమాన చరిత్ర కావచ్చు. గత చరిత్ర కావచ్చు. సుదూర సమీప గతాలతో పాటు వర్తమాన చరిత్రను కూడా పతంజలి కథనంలో భాగం చేస్తాడు. అవి యధార్థ రూపంలో ఉండవు. కొంత విరూపానికి గురవుతాయి. వర్తమాన చరిత్రను ఒక చరిత్రకారుడు దృష్టితోనే అన్వయిస్తాడు. ఈ అన్వయక్రమంలో నిజమైన కథ ఆధారంగా చేస్తాడు. తన కథనం దానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఉంటుంది.

పతంజలి రచనలలో కనిపించే వర్తమాన చరిత్రాంశ లేదా వస్తువు ఆయా వాస్తవ ఘటనలు రచయిత ఊహలు కావు. అవి వాస్తవంగా సంభవించినవి. సంఘటనలు కథకుడు కనుగొన్నవి కాదు. ఉన్నవాటినే కథకుడు వాటికి ఒక ఆకృతిని ఇచ్చే క్రమంలో కనుగొన్నవి అవుతున్నాయి. అట్లా కనుగొన్నవే మెటా ఫిక్షన్ గా మారుతున్నాయి. మెటా ఫిక్షన్ ను కల్పనకు విమర్శకు మధ్య ఉండే సరిహద్దు రేఖ పై నిలబడి సాగించే చర్చ లేదా సంవాదంగా చెప్పగల వీలుంది. రచనలో సాహిత్య వస్తువే విమర్శక కార్యాన్ని సాధిస్తుంది. విమర్శ ఫిక్షన్ లో అంతర్లీనంగా సాగుతుంది. జీవితం, దానిని వెన్నంటిన వాస్తవం, అందులోని విలువలు, దృక్పధాలు, సామాజిక పోకడలు, వ్యక్తులు, వారి వారి ప్రాపంచిక దృష్టి కోణాలు ఒకటేమిటి రచయిత తను స్వీకరించిన పరిధిలోకి వచ్చే ప్రతి అంశము ఒకవైపు కల్పనను, మరోవైపు విమర్శను మొదలుపెడుతుంది. పతంజలి తొలి నవల ఖాకీ వనంలో రచయిత పోలీసుల వాస్తవ జీవితాన్ని చిత్రించాడు. జీవిత చిత్రణలో వాస్తవికత, దానిపై విమర్శ విడివిడిగా లేవు. అవి రెండు కలగలిసిపోయాయి. అట్లాగే అప్పన్న సర్దార్, నువ్వే కాదు, పెంపుడు జంతువులు, రాజుగోరు ఇలా రచనలన్నింటిలోనూ ఈ ధోరణి కనిపిస్తుంది. రచయితగా, విమర్శకుడిగా రెండు భూమికలు పోషిస్తూ కల్పనకు, విమర్శకు మధ్య నవలలను నాటకీకరించటం కనబడుతుంది.

మెటాఫిక్షన్ పరంగా చూస్తే, 'గోపాత్రుడు'లో పతంజలి మానవ మనస్తత్వాల వాస్తవిక చిత్రణ చేయదలచుకున్నాడు. ఆ మనస్తత్వాలను విమర్శించదలచుకున్నాడు. అందుకు ఎంచుకున్న నేపథ్యం దేశంలోని అనేకానేక గ్రామాలకు ప్రతినిధిలాంటి ఆలమండ గ్రామం, అక్కడి ప్రజానీకం. 'గోపాత్రుడు'లో రచయిత 'భూమి గుండ్రంగా ఉందా? బల్లపరుపుగా ఉందా?' అన్న ఒక సామాన్యమైన ప్రశ్నను సాకుగా తీసుకుని దాని చుట్టూ సమాజ దృష్టికోణాల్ని నిర్మించడం మెటాఫిక్షనల్ ధోరణికి ఉదాహరణ. కథనం తన స్వరూపాన్ని తానే ప్రశ్నించుకునేలా, వాస్తవాన్ని వ్యాఖ్యానించేలా నడుస్తుంది. నవలలో వ్యక్తి స్వేచ్ఛావాదిగా గోపాత్రుణ్ణి నిలబెట్టి, తత్పర్యవసానంగా జరిగే

సంఘటనలను చిత్రిస్తూ, వాటి అర్థసంబంధాన్ని, వాటి వెనుకనున్న సామాజిక అవగాహనను కూడా విమర్శాత్మకంగా ప్రతిబింబిస్తాడు. 'గోపాత్రుడు'ను కథగా పరిగణించాలా? నవలగా పరిగణించాలా? అనే సందిగ్ధత కూడా దాని మెటాఫిక్షనల్ స్వభావానికే సంకేతం. ఇక్కడ కథనం కేవలం సంఘటనల క్రమం కాదు; అది జీవన వాస్తవాన్ని ఎలా గ్రహిస్తున్నామన్న దానిపై ఒక సాహిత్య విమర్శ.

**అద్భుత వాస్తవికత (మేజిక్ రియలిజం)**

'మేజికల్ రియలిజం' అనే పదం 1925లో ఫ్రాంజ్లో అనే జర్మన్ విమర్శకుడు మొదటిసారిగా వాడాడు. జర్మన్ చిత్రకారుల చిత్రాల్లోని నూతన దృశ్యాలను, రంగుల సమ్మేళనాన్ని, గీతల విన్యాసాల్ని నైరూప్య చిత్ర లక్షణాల్లోని విలక్షణ అద్భుత దృశ్యాల్ని, పోకడలను వాటిలోని అద్భుత వాస్తవికతను వర్ణించాడు. ఈ ప్రభావం ఇటలీ, అమెరికా చిత్రకళారంగంపై పడింది. క్రమేణా ఈ ప్రభావం సాహిత్యంలోకి కూడా వ్యాపించింది. లాటిన్ అమెరికన్ రచయితగా తన మూలాల చింతనాత్మక అన్వేషణలో, తాను తనకు తెలియని వాస్తవికతను వెతుకులాడే క్రమంలో ఒక అసాధారణ సాహిత్య దృగ్విషయాన్ని కనుగొన్నానని దానిని విమర్శకులు మేజికల్ రియలిజంగా పిలుస్తున్నారని అభిప్రాయపడిన మార్క్వెజ్ ఈ కథన పద్ధతిని శిఖరాగ్రాలకు తీసుకుపోయాదని విమర్శకులంటారు. మూడవ ప్రపంచదేశాల్లో నిరంతర సంఘర్షణ, అక్కడి సమాజాల్లోని అవినీతి, అలసత్వం అనుభవించిన అక్కడి రచయితలు ఆయా పరిస్థితులను తమ రచనల్లో దృశ్యమానం చేశారు. లాటిన్ అమెరికా దేశాల్లోని సంక్షోభమే మార్క్వెజ్ రచనలో అద్భుత వాస్తవికతగా వ్యక్తమైనట్లు అర్థమవుతుంది. గుంథర్ గ్రాస్, సల్మన్ రధ్దీ, మిలన్ కుందేరాల రచనల్లో ఈ ధోరణి అద్భుతంగా దృశ్యమానమైంది. ఈ రచయితలంతా అసాధారణమైన చారిత్రక ఆటుపోట్లను తమ జీవిత కాలంలోనే అనుభవించి ఆ పరిస్థితుల్లో జీవించి అనుభవం గడించినవారు. ఆ వరుసలోనే పతంజలి తన రచనల్లొ కూడా సమకాలిన అస్తవ్యస్త పరిస్థితుల్లోని అసంబద్ధతను వ్యక్తపరచడానికి అద్భుత వాస్తవికతను ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగించుకున్నాడు. పతంజలి రచనలన్నీ వాస్తవం లోతుల్లో కనిపించే అసలైన అసంబద్ధ వాస్తవ సంబంధాల్ని చూపిస్తుంది.

గోపాత్రుడులో భూమి ఆకారంపై జరిపించిన చర్చ ద్వారా నమ్మకం, విశ్వాసం, జ్ఞానం, అధికారం, కులం, స్వార్థం, రాజకీయం, ధనం, సామాజిక నైతిక విలువలు మొదలైన భావనల్లో అన్వేషించినదీ తను ఇంతకుముందు ఎరుగని వాస్తవికత లేదా సత్యం. అద్భుతమైన వాదనను, భిన్నమైన పరిస్థితులను సృష్టించి, ఒక గందరగోళ వాతావరణంలోంచి వాస్తవికతను సందర్శింపజేస్తాడు పతంజలి. విలువలతో కూడిన వ్యవస్థను, విలువలు కలిగిన మనుషుల కోసం ఆయన అన్వేషణ సాగింది. ఈ క్రమంలో ఆయన వెదుకులాడిన వాస్తవికత లేదా సత్యం దొరకలేదు. రచనలు మాత్రం ఒక అద్భుత వాస్తవికతను బయటపెట్టాయి. సాధారణమైన ఘటనలలో సునిశితంగా చెప్పవలసిన వాస్తవికతను వ్యక్తీకరించటానికి పురాణ కథలను, జానపదకథల పోకడలను మేళవించి అద్భుతవాస్తవికతా కథనం జరుగుతుంది.

పతంజలి 'రాజుగోరు'లో ప్రవేశపెట్టిన వీరబొబ్బిలి పాత్ర, ఒక ప్రధాన పాత్రగా 'వీరబొబ్బిలి' నవలలో, ఒక పాత్రగా 'గోపాత్రుడు' నవలలో కనబడుతుంది. భూమి బల్లపరుపుగా ఉందన్న స్నేహితుడు గోపాత్రుడితో తను ఏకీభవించలేనని, భూమి గుండ్రంగా ఉందన్న వాళ్ళతో తనకున్న రాచకార్యం వల్ల వాళ్ళ అభిప్రాయంతోనే ముందుకు వెళ్తానంటాడు ఫకీర్రాజు. స్నేహం స్నేహమే వ్యవహారం వ్యవహారమే అని తేల్చేస్తాడు. ఆ తర్వాత  తన రాచకార్యం బెడిసికొట్టడంతో గోపాత్రుడి అభిప్రాయమే తన అభిప్రాయం అంటాడు. అప్పటినుండి భూమి బల్లపరుపుగా ఉందన్న వాదాన్ని బలపరిచే వాళ్ళ కోసం ఆలోచన చేస్తాడు. తన దగ్గర పాతిక రూపాయల అప్పు తీసుకున్న రొంగలి అమ్మన్నను పిలిచి, ఉన్న ఫలాణా అప్పు తీర్చమని లేదంటే భూమి బల్లపరుపుగా ఉందని ఒప్పుకోమంటాడు. ఇంటికెళ్ళి తెచ్చిస్తానన్నా అంగీకరించడు. 'పాతిక రూపాయల లాభం, వదులుకోక'ని కుక్కముండ బొబ్బిలి చెప్పిన సలహా విని భూమి బల్లపరుపుగా ఉందని ప్రకటిస్తాడు అమ్మన్న. అక్కడినుండి బయటపడ్డ మారు క్షణం నుండి తాను అలా పాతిక రూపాయల కోసం అభిప్రాయం మార్చుకోవడం తప్పని, తమ కుల పెద్ద దగ్గర డబ్బు తీసుకుని తిరిగి ఫకీర్రాజు ఇంటికి వచ్చి అప్పు తీర్చి , భూమి గుండ్రంగా ఉందన్న తమ కులం అభిప్రాయమే తనదీ అని చెప్తాడు అమ్మన్న. మనుషులలోని మూర్ఖత్వాన్ని వ్యాఖ్యానించటానికి బొబ్బిలి స్వగతాన్ని ప్రకటిస్తాడు రచయిత. కులం కోసం డబ్బును ఎడం చేత్తో విసిరేసిన అమ్మన్నను చూసి లోకం యావత్తూ నేర్చుకోవలసింది ఎంతో ఉందని, మరి తాను కుక్క అవతారమెత్తి లోగిట్లో కుక్కలతో, ఊర్లో కుక్కలతో కుక్కలాగా ప్రవర్తించలేదనీ బాధపడుతుంది. ఊర్లో వెలమలందరూ ఒక మాట మీదుండి, రాజులందరూ ఒక మాట మీదుంటే, కుక్కలన్నీ ఒక మాట మీద వుండాలా? వద్దా? అని తర్కించుకుంటుంది. మరుక్షణమే మనుషులందరూ రాజులుగా, వెలమలుగా విడిపోయాకా కుక్కలన్నీ ఒక్కటిగా ఉండనవసరం లేదని నిర్ణయానికొస్తుంది. తన కుటుంబానికి చెందిన మరో కుక్క లేదు తానొక్కతే ఒక మాట మీద ఉండొచ్చని, ఫకీర్రాజూ, గోపాత్రుడూ ఏదంటే అదే తన అభిప్రాయం అనుకుంటుంది. మరుక్షణమే భూమి ఆలాగుందీ, ఇలాగుందీ అంటున్నారు. భూమి ఎలాగుందో మనకు తెలుసు. అది గేదె కొమ్ములాగా ఉంది. లోకంలో సత్యాలను తెలివితక్కువ వాళ్ళు పరిశీలించి తెలుసుకుంటారని, తెలివైనవాళ్లు ఊహించి తెలుసుకుంటారని, అది తనకు మాత్రమే తెలుసునని అనుకుంటుంది.

భూమి ఆకారం విషయమై అలమండ గ్రామం అంత రెండుగా చీలిపోయి యుద్ధానికి సన్నద్ధం అవుతారు అలమండ గ్రామ ప్రజలు. రొంగలి బుజ్జి పక్కన నిలబడ్డ రొంగలి అమ్మన్న తన ఎదురుగా ఉన్న గుంపు వైపు చూస్తాడు. అక్కడ ఉన్నవాళ్లలో 90% మంది తమ కులస్తులు, తమ బంధువులందరూ అతనికి స్పష్టంగా కనిపిస్తుంటారు. మరి ఇప్పుడు యుద్ధం అంటూ చేస్తే వాళ్ళ తలలు పగలగొట్టాలి. మేనమామల మీద కలబడాలి. కాబట్టి తానీ యుద్ధం చేయలేనని తన చేతిలో ఉన్న కర్ర రొంగలి బుజ్జి కాళ్ళ దగ్గర పడేస్తాడు. అప్పుడు రొంగలి బుజ్జి నువ్వు కర్ర కింద పడేసినంత మాత్రాన ఎవరు నిన్ను ఏది అనకుండా ఉంటారని అనుకోకు. కులం ఒకటే అయినా నువ్వు వాళ్ళకి ఎక్స్ పార్టీలో ఉన్నావని మర్చిపోకు. అయినా చేతిలో కర్ర అనేది ఉంటే ఎదుటోడి నెత్తి బద్దలు కొట్టడానికే ఉన్నదని భ్రమ వదిలేసుకొని, ఎదుటివాడి కర్ర నీ బుర్ర మీద పడకుండా చూసుకోవడానికి కర్ర పట్టుకోవాలి అని బోధ చేస్తాడు.

అప్పుడు అమ్మన్న తను ఎప్పుడు వెనకనుంచి చీకట్లో కొట్టడమే కానీ ఎదుటిపడి ఎవరిని కొట్టలేదని ఇప్పుడు మిట్ట మధ్యాహ్నం పూట తను ఎవరిని కొడుతున్నాడో వాడికి తెలిసిపోయేటట్లు కొట్టడం తన వల్ల కాదని తన కొట్టలేని అంటాడు. అందుకు బుజ్జి అసలు సొంత కులానికి, సొంత మనుషులకి అపకారం చేయలేనివాడు పరాయి మనుషులకు ఎలాంటి అపకారం చేయలేడు. ఇదే జ్ఞానోపదేశం. నీది తప్పించి మిగిలింది అంతా పరాయిదేను నువ్వు నీకోసం బ్రతకాలి అని మళ్ళీ బోధ చేస్తాడు. అప్పుడు అమ్మన్న తనకు అప్పిచ్చి తిరిగి డబ్బులు అడిగిన వాళ్ళందరూ ఇప్పుడు తమ పక్షానే ఉన్నారని కొడితే వాళ్లను కొట్టాలిగానీ తాను అధర్మానికొడిగట్టలేనని అంటాడు. అప్పుడు బుజ్జీ జరగబోయేది దొమ్మీలో ఎవరు ఎవరిని కొట్టాలో తెలిసే అవకాశం లేదు కాబట్టి యుద్ధం ప్రారంభం అయిన తర్వాత నీకు ఎవరి మీద కోపం ఉంటే వాడిని కొట్టు అని చెప్తాడు అలా తన సందేహాలన్నీ నివృత్తి అయిన తరువాత సమరోత్సాహంతో బాణాకర్రా అందుకుంటాడు రొంగలి అమ్మన్న. ఈ రెండు సన్నివేశాలలో మానవ నైజాలలోని వాస్తవికతను వెల్లడి చేయడానికి రచయిత అద్భుత వాస్తవికత కథనరీతిలోని పురాణ కథలను, జానపదకథల పోకడలను ప్రయోగిస్తాడు. వీరబొబ్బిలి పాత్ర పంచతంత్ర కథలను, రొంగలి అమ్మన్నకి బుజ్జి చేసే జ్ఞానోపదేశం గీతాబోధను గుర్తుచేస్తూ సాగుతాయి.

అద్భుత వాస్తవికత పరంగా 'గోపాత్రుడు'లో వాస్తవం–కల్పనల మేళవింపు స్పష్టంగా కనిపిస్తుంది. భూమి ఆకారంపై ఉన్న చర్చ వాస్తవ శాస్త్రీయ ప్రశ్నగా మొదలై, సామాజిక విశ్వాసాల అబద్ధపు నిర్మాణాలపై వ్యంగ్య వ్యాఖ్యగా మారుతుంది. ఇక్కడ అద్భుత అంటే మాయాజాలం కాదు; సాధారణ జీవితంలో ఉన్న అసంబద్ధతను వాస్తవికంగా, కొద్దిగా విరూపితంగా చూపించడం. గోపాత్రుడు అనే పాత్ర ఒక వ్యక్తి మాత్రమే కాదు; అది సమాజంలోని అనేక దృష్టికోణాల ప్రతినిధి. ఈ విధంగా వాస్తవ సంఘటనల్ని స్వల్ప వక్రీకరణతో చూపించి, అవి ఎంత అసంబద్ధంగా ఉన్నాయో బలంగా వ్యక్తపరచడం మేజికల్ రియలిజం లక్షణంగా నిలుస్తుంది.

**సమాంతర వాస్తవికత (Parallel Realism)**

ఒక్కొక్క వాచకానికి అనేక ధర్మాలుంటాయి. ఒక పాఠకుడు ఒక వాచకాన్ని అనేకసార్లు చదివినప్పుడు గానీ, అసంఖ్యాక పాఠకులు ఒక వాచకాన్ని ఒక పర్యంతం చదివినా వాచక ధర్మం విభిన్నంగా బహిర్గతమవుతూ ఉంటుంది. పతంజలి వాచకంలో ఇటువంటి ధర్మాల బహుళత ఎక్కువగా వ్యక్తమవుతుంది. దీనిని మనం సమాంతర వాస్తవికతగా వ్యవహరించడం సముచితంగా ఉంటుంది. వాస్తవికతను చిత్రించి చూపించేందుకు రచయిత రచన చేస్తాడు. అయితే తాను చిత్రిస్తున్న వాస్తవికతను అనుభవంలోకి తీసుకుంటున్న పాఠకుడు దాని గురించి ఏదో ఒక వైఖరిని అవలంబించవలసి ఉంటుంది. కథన క్రమంలో బహిర్గతమవుతున్నట్లుగా ఉంటూ పఠనానుభవంలో తాను ఆ వాస్తవికత పట్ల ఏ వైఖరిని తీసుకుంటాడో, ఆ వైఖరిని కలిగించేందుకు దోహదపడేదే సమాంతర వాస్తవికత. సహజంగా ఇది రచయిత కంఠ ధ్వనిని ఆశ్రయించి ఉంటుంది. కంఠ ధ్వని రచయిత దృక్పథంతో ముడిపడి ఉంటుంది. పతంజలి విలక్షణంగా కనిపిస్తుండడానికి ఆయన రచన లేదా వాచకం సమాంతర వాస్తవికతను కలిగి ఉండడమే. ఇది ఎప్పటికీ అంతమయ్యేది కాదు. ఒక వాచకం వాస్తవికత అంటే వాచకానికి ఉన్న సామర్థ్యం. అది

బహుధర్మ నిర్మితం. అనేకసార్లు భిన్నమైన అంశాలు గుర్తించబడతాయి. పఠనం ఎప్పుడూ పూర్తిగా సామర్థ్యం గల వాచకాన్ని ముగించలేదు. ఎన్ని పర్యాయాలు చదివినా ఎన్నింటిని కొత్తగా గుర్తించినా, మరొకటి ఏదో అందులో స్ఫురిస్తూ ఉంటుంది.

గోపాత్రుడు భూమి గుండ్రంగా లేదన్నాడు. అది మొదలు అభిప్రాయ భేదాలు మొదలయ్యాయి. ప్రతి ఒక్కరూ మరొకరితో విభేదించారు. ఒక వర్గం కులం, రాజకీయ విశ్వాసాల ఆధారంగా విడిపోయారు. ఇదే సందర్భంలో ఆ గ్రామంలో ఆయా మనుషుల మధ్య ఉండే పాతవిభేదాలు కొత్త కక్షలుగా మారాయి. వాటితో ఒక సంఘర్షణాయుత వాతావరణం కూడా ఏర్పడింది. గోపాత్రుడు ఇంటికి వచ్చాక పాత్రుడి భార్యకు, గోపాత్రుడి కుక్కకు ఘర్షణ మొదలైంది. ఈ విషయాన్ని చర్చించేందుకు తగు మనుషులు సిద్ధపడ్డారు. ఈ తగువు తీర్చడానికి పూనుకున్న వాళ్ళలో గాజుల పాపయ్య, తెలకలి గురవయ్యలు ఉన్నారు. వీరితో పాటు మరికొందరున్నారు. గోపాత్రుడు భార్య ముందుగా తెగించి కుక్కని తానే కరిచానని చెప్పినా గాజుల పాపయ్య వినిపించుకోడు. ఆవిడ నిజం చెప్పినా నేను నమ్మదల్చుకోలేదు. అది నా ఇష్టం. ఎదుటివాడు చెప్పింది నమ్మాలో, లేదో తెలుసుకునే హక్కు నాకుంది. ఎదుటివాడు చెప్పేది ఖాయంగా అబద్ధం అనుకునే హక్కు కూడా నాకుంది. నేనొక్కడినే లోకంలో నిజం చెప్పే వాడినని అనుకునే హక్కు కూడా నాకుందని ప్రమేయం కల్పించుకున్నాడు. ఇదంతా చూస్తున్న తెలకలి గురయ్య, కుక్క మనిషిని కరిస్తే గాబరా ఏముంది? అందరినీ అక్కడి నుండి వెళ్లిపొమ్మన్నాడు. గాజుల పాపయ్య అంతకుమును మాట మీద మాట వచ్చి గురయ్యా చేతిలో దెబ్బలు తిన్నాడు. ఆ పాత కోపం, దెబ్బలు తిన్న ఉక్రోషం ఇంకా సమసిపోలేదు. పాపయ్యకి ఒక వైపు బెదురు వుంది. మరోవైపు ధిక్కరించాలన్న కోరికా వుంది. అక్కసుతో "అయినా సరే మావందరం ఇక్కడే వుంటాం. మా ఇళ్ళకాడ మాకు వూసుపోదు" అంటూ చుట్టూ చేరిన ప్రజలందరి పక్షాన ప్రకటించాడు. గ్రామస్థులంతా దీనిని అంగీకరించారు. తనను కాదన్న వాళ్ళను బెదిరించడానికి తెలకలి గురవయ్య 'సాముకర్ర' పట్టుకొచ్చి దానితో వాళ్ళను హెచ్చరించాడు "నిమిషాల్లో పాతుర్దు గోరి గడపకాడ పిట్ట మనిసి వుండటానికి వీల్లేదు. ఉంటే బుర్ర పగిలిపోతాది! పాతర్దుగోరూ, మీరు నోపలికి ఎళ్ళి పోండి! తలుపులు ఏసీసుకోండి. బొబ్బిలీ! నువ్వు మీ రాజుగారింటికి పో! ఈళ్ళందరి సంగతి నేన్జూసుకుంటాను" అని హామీ ఇచ్చాడు. ఈ సన్నివేశం ఇట్లా కొనసాగుతూనే వుంది. ఈ సంఘటన క్రమాన్ని ఇంతగా విస్తరించి రాయటంలో రచయిత ఉద్దేశం ఒక్కటే ప్రధాన ఇతివృత్తాన్ని బలపరుస్తూ సాగే అంశం ఇది. రెండు భిన్న అభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు, అవి బలంగా తమ స్వమతాన్ని స్థాపించాలనుకున్నప్పుడు ప్రజాస్వామ్యం అనే భావనకు చోటుండదు. ఆధిక్యతా, అనాధిక్యతలు మాత్రం వుంటాయి. దీనిని కూడా రచయిత పైకి ప్రకటించారు.

ఆ తరువాత జరిగిన సంభాషణలో కూడా 'గురయ్య చెప్పిన మాటాలెందుకు వినాలని' కారు నాయుడు ప్రశ్నిస్తే, 'నా సేథిల బాణా కర్రున్నాది కాబట్టి, నా సేతిలో కర్రున్నంత సేపు ఎదటోడు నాను జెప్పినట్టు ఇనుకోవాలని నాకెందుకో అనిపిస్తాది' అంటాడు. ఇలా అనటంలోని అసలు విషయం గురయ్యకున్న ఆధిక్యత. అది అతని వద్ద ఉన్న కర్ర వల్ల వచ్చింది. దానితో ఇతరులను లొంగ తీసుకోవాలన్న మానవ సహజ స్వభావం వల్ల వచ్చింది. అదే

ప్రకటితమైంది. రచయిత తానెంచుకున్న ఇతివృత్తంలోని వాస్తవానికి సమాంతరంగా వచ్చిందే ఈ సన్నివేశంలోని వాస్తవం. ఇలా నవల ఆసాంతం భూమి ఆకారంపై సాగే వాదనలో ఆధిక్యత, అనాధిక్యతలు వ్యక్తమైనట్లే సమాంతర సన్నివేశాలలో కూడా ఈ ధోరణి వ్యక్తమవుతూ వస్తుంది. ఈ ద్వంద్వ దృశ్యం ద్వారా పతంజలి జీవన వాస్తవాన్ని ఒకే కోణంలో కాక, అనేక కోణాల్లో చూపిస్తాడు. అందువల్ల 'గోపాత్రుడు' కేవలం ఒక సామాజిక వ్యంగ్య రచన మాత్రమే కాదు; అది వాస్తవం, కల్పన, విమర్శల మేళవింపుగా రూపుదిద్దుకున్న శిల్పప్రయోగాత్మక రచన.

ఉపయుక్త గ్రంథాలు:

1. R.K.Sharma-Contemporary Black Humour-American Novel
2. Bruce J.Friedman-Black Humour
3. కె.ఎన్.వై.పతంజలి ఇంటర్వ్యూ –'గమనం' ప్రజాశక్తి ఏప్రిల్ 2001
4. డా.అఫ్సర్ – తెలుగు కథకులు-కథన రీతులు
5. వల్లంపాటి వెంకటసుబ్బయ్య- నవలాశిల్పం
6. Patricia Waugh-Metafiction
7. Mark Currie Metafiction
8. Milan Kundera-Magical Realism (Essay) - The Art of Fiction